రోడ్లపై చెత్తవేస్తే జరిమానా

డిచ్‌పల్లి, జూలై 30: రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని నడ్పల్లి పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు అన్నారు. నడ్పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ రకాల వ్యాపారులకు గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం నోటీసులు అందజేశారు. దుకాణాల్లోని చెత్తా చెదారాన్ని రోడ్లపై పారవేయరాదని నోటీసులో పేర్కొన్నారు. చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థ పదార్థాలను సమీపంలోని చెరువులో ఎక్కడపడితే అక్కడ వేయవద్దని పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు సూచించారు.

ఉపాధి కూలీల ఇబ్బందులు పరిష్కరించాలి

ధర్పల్లి, జూలై 30 : బ్యాంకు ఖాతాల విషయంలో ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, నూతన ఖాతాను తెరిచి కూలి డబ్బులు వెంటనే వారి ఖాతాల్లో జమచేసేలా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.

'ఆ అధికారులను సస్పెండ్ చేయాలి'

సిరికొండ, జూలై 30 : సిరికొండ, తూంపల్లి సహకార సంఘాల్లో అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీకి నోచుకోకుండా నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్యాలయం ఎదుట సీఈవో, అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు రమేశ్ మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోయిన రైతులకు రుణమాఫీ చేయాలని లేకుంటే రైతులతోకలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, సాయారెడ్డి, రమేశ్, ప్రణీత్, రైతులు రాజన్న, భోజన్న, రవి, పద్మ, సాయన్న పాల్గొన్నారు. నష్టపోయిన రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ గంగరాజంకు వినతి పత్రం అందజేశారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాలి

డిచ్‌పల్లి, జూలై 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని, రైతులకు రూ. రండు లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్ మోర్చా డిచ్‌పల్లి శాఖ నాయకులు స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు పాటుకూరి తిరుపతిరెడ్డి మట్లాడుతూ..రైతులకు రైతుభరోసా ఎకరానికి రూ.7500 ఇవ్వాలని, కౌలు రైతులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

'ఆర్టీసీ డ్రైవర్ల తప్పు ఉంటేనే కేసులు పెట్టాలి'

వినాయక్‌నగర్, జూలై 30: ఆర్టీసీ డ్రైవర్ల తప్పు ఉంటేనే వారి పై కేసులు పెట్టాలని, లేకుంటే ఎట్టి పరిస్థితిలో కేసులు పెట్టరాదని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లపై ఉన్న కేసులపై పునః సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ బి.కోటేశ్వర రావు,ట్రాఫిక్ ఏసీపీ నారాయణ,ఆర్టీసీ ఆర్ఎంవో కె.జానిరెడ్డి, డిప్యూటీ ఆర్ఎంవోలు శంకర్,సరస్వతి, డిపో-1,2 మేనేజర్లు బి.ఎస్.ఆనంద్,రవికుమార్,ఆర్మూర్, బోధన్ డిపో మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ డ్రైవర్ల కేసులపై మాట్లాడి వివరాలు అడిగి, పలు సూచనలు చేశారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి

మోర్తాడ్, జూలై30: జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న తమకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు కోరారు. మంగళవారం జాతీయరహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో మోర్తాడ్‌లో ఆర్డీవో రాజాగౌడ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన భూమిని కోల్పోతున్న రైతుల వివరాలను ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2013 చట్టం ప్రకారం సేకరించిన భూమికి పరిహారం వస్తుందని, ఇంకా ఏమైనా ఫిర్యాదులుంటే అందజేయాలని రైతులకు సూచించారు. రైతులు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ రంజిత్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

బోధన్/ మోర్తాడ్/ నందిపేట్/ఆర్మూర్‌టౌన్/ఖిల్లీవాడీ/కంఠేశ్వర్, జూలై 30: లయన్స్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ బాబూరావు పుట్టినరోజు సందర్భంగా బోధన్ పట్టణం ఆటోనగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ రాయల్ ఆధ్వర్యంలో 120 మంది నిరుపేదలకు మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.లక్ష్మి, బోధన్ రాయల్ అధ్యక్షుడు జమీల్ పటేల్, కార్యదర్శి దమ్మల జ్యోతి రాజ్, కోశాధికారి జి.రవీందర్ పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ మోర్తాడ్ ఆధ్వర్యలో మండల కేంద్రంలో అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు గోపిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. నందిపేట్‌లో సుమారు 200 మందికి అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు శౌరీబాబు, కార్యదర్శి గోపినాథ్, సభ్యులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని తపస్వీ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు అధ్యక్షుడు చెరుకు పృథీరాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో పిల్లలకు అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ డైమండ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ దవాఖానలోనూ అన్నదానం చేసినట్లు అధ్యక్షుడు రాజేశ్వర్ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ఎడపల్లి, జూలై 30: మద్యానికి బానిసై కుర్నాపల్లిలో మామిడి చిన్న సాయిలు(36) కూలీ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడు మద్యానికి బానిసై అప్పులు చేశాడు. భార్యతో తరుచూ గొడవ పడే వాడు. భార్య ఆరేండ్ల క్రితం తల్లి గారింటికి వెళ్లింది. అప్పటి నుంచి వేరుగా ఉంటున్న సాయిలు మంగళవారం గుడిసెలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి పోసాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డెంగీ బాధిత ఇంట్లో దోమల మందు స్ప్రే

రెంజల్, జూలై 30: మండలంలోని పేపర్‌మిల్ గ్రామంలో ఇటీవల రాహన్‌బేగ్ (3) అనే బాలుడు డెంగీ వ్యాధికి గురికాగా ఆ కుటుంబం నివాసం ఉంటున్న ఇంటిని మంగళవారం బోధన్ డివిజన్ డెంగీ నివారణ అధికారి వెంకటేశ్వర్లు పరిశీంచారు. ఆ ఇంట్లో దోమల మందు స్ప్రే చేయించారు. ఎంఎల్ హెచ్ఎం ఇమ్రన్‌బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజాపాలన'పై నిర్లక్ష్యం వద్దు

అదనపు కలెక్టర్ అంకిత్

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ, జూలై30: ప్రజాపాలన దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని అదనపుకలెక్టర్ అంకిత్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో అధికారులతో మాట్లాడారు. ప్రతి దరఖాస్తునూ పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రజాపాలన దరఖాస్తులను, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, పల్లెప్రకృతి వనాన్ని అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బస్సాపూర్‌లో సంపద వనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగా మోహన్, ఏఈ వినీత్, ఏపీఎం శివగంగాధర్, పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కొండలో పాఠశాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ముందస్తు అరెస్టులు తగదు

కోటగిరి/ రుద్రూర్/ మోస్రా (చందూర్)/శక్కర్‌నగర్, జూలై 30: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న హైదరాబాద్‌లో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పంచాయతీ కార్మికులను ముందస్తు అరెస్టు చేశారని కోటగిరి పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు రాజేశ్వరి అన్నారు. పోలీసులు సోమవారం రాత్రి ఎత్తొండలోని తమ ఇంటికి వచ్చి ధర్నాకు వెళ్లవద్దని నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్టు చేశారని తెలిపారు. మండలం దాటి వెళ్లవద్దని నోటీసులో ఉందన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ధర్నా చేసేవారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. రుద్రూర్‌లోనూ కార్మికుల అరెస్టుపై పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ..ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. మోస్రా మండలంలోని గోపూర్ గ్రామానికి చెందిన సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్‌ను మంగళవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. ప్రజా పోరాటాలను గృహ నిర్బంధంతో ఆపలేరని అన్నారు. బోధన్ పట్టణానికి చెందిన కార్మిక సంఘాల నాయకులు జె. శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్‌తోపాటు మరికొంత మందిని బోధన్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. సొంతపూచీకత్తుపై సాయంత్రం వదిలివేశారు.

గోపూర్‌లో నన్నేసాబ్‌కు అర్ధరాత్రి నోటీస్ అందజేస్తున్న పోలీసులు

కార్మికులపై వేధింపులను ఆపాలి

ఖిల్లీవాడి, జూలై 30: సంబంధంలేని విషయాలపేరుతో వివిధ రంగాల కార్మికులు, ప్రజాసంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తూ బైండోవర్ల పేరుతో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు పేర్కొన్నారు. ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనని మున్సిపల్ ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ 5వ టౌన్ ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి విధులకు ఆటంకం కల్పించకూడదని కోరారు. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసన కార్యక్రమాలను తెలియజేయాలని, ఇందుకోసం ధర్నాచౌక్‌ను ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ చెబుతున్నప్పటికీ ఆచరణలో దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముందస్తు బైండోవర్ పేరుతో అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, నాయకులు భూపతి, ఏక్‌నాథ్, మోహన్, సంతోష్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.
-వినాయక్‌నగర్, జూలై 30

రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు

- **పోలీసులమని చెప్పి రూ.95 వేలు కాజేసిన వైనం**

జక్రాన్‌పల్లి/ వినాయక్‌నగర్/ఏర్గట్ల, జూలై 30 : జిల్లాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నిత్యం ఏదోఒక చోట మోసపోయిన ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. తాజాగా పోలీసులమని చెప్పి డబ్బులు కాజేసిన ఘటన జక్రాన్‌పల్లి మండలంలోని పడగల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం..పడకల్‌కు చెందిన ఓ వ్యక్తికి సోమవారం వాట్సప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి 'మేము పోలీసులం.. నీ కొడుకుపై కేసు ఉంది. మా ఆధీనంలో ఉన్నాడు. మీరు డబ్బులు మాకు పంపితే మీ కొడుకుని వదిలేస్తామని..' బెదిరించారు. దీంతో సదరు వ్యక్తి వారికి ఫోన్‌పే ద్వారా రూ.95 వేలు పంపించాడు. అనంతరం అతడి కొడుకుకు ఫోన్ చేయగా తాను క్షేమంగానే ఉన్నానని, అలాంటిదేమీలేదని చెప్పడంతో తాను మోసపోయినట్లు తెలుసుకొని పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

డిచ్‌పల్లి మండల పరిధిలోని ధర్మారం మెంట్రాజ్‌పల్లి రోడ్డులో సురేశ్ అనే వ్యక్తికి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ కాల్ చేసి 'నీపై పోలీస్ కేసు నమోదైంది..దాని నుంచి నీవు బయటపడాలంటే డబ్బులు ఇవ్వాలంటూ' డిమాండ్ చేశాడు. అప్రమత్తమైన సురేశ్ డయల్-100 కు సమాచారం అందించాడు. కానిస్టేబుల్ సురేశ్ వద్దకు చేరుకొని అది సైబర్ నేరగాళ్ల కాల్ అని గుర్తించారు. ఈ ఘటన పై నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

తడ్‌పాకల్‌లో..

ఏర్గట్ల మండలంలోని తడ్‌పాకల్ గ్రామానికి చెందిన ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. 'దుబాయ్‌లో ఉన్న నీ భర్త మా ఆధీనంలో ఉన్నాడు.. ఆయనను వదలాలంటే రూ.50 వేలు పంపించు అని డిమాండ్ చేశారు. ఆమె ఏర్గట్ల పోలీసులను సంప్రదించగా భీమ్‌గల్ సీఐ నవీన్, ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత మహిళతో మాట్లాడారు. ఇది సైబర్ నేరగాళ్ల పని అని అటువంటి ఫోన్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఉత్తమ డ్రైవర్లకు అవార్డుల ప్రదానం

అవార్డులు అందుకున్న డ్రైవర్లు

ఖిల్లీవాడి, జూలై 30 : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజియన్‌లో ఈనెల 24 నుంచి 30 వరకు చేపట్టిన ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా డిపో-2లో మంగళవారం ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీజియన్ డిపోల వారీగా ముగ్గురు ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లకు అవార్డులకు అందజేశారు. ఈనెల 1 నుంచి 15 వరకు డీలక్స్ బస్సులో ప్రయాణించి విజేతలుగా నిలిచిన మహిళా ప్రయాణికులకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్, రీజినల్ మేనేజర్ జానిరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేర్ సరస్వతి, శంకర్, మేనేజర్లు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలి

శక్కర్‌నగర్, జూలై 30: బోధన్ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మెంబర్ రామకృష్ణ, కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు నాగుల రవిశంకర్ గౌడ్, యువజన నాయకుడు జక్కు సంజు పాటిల్ మాట్లాడారు. బోధన్ శివారులో 446 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించారని అన్నారు. పట్టణంలో స్థలాలు ఉన్న వారు ఇండ్లు నిర్మించుకున్నారని, వారికి పూర్తి బిల్లులు అందించాలని కోరారు. బోధన్‌లో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాఠశాలలో 'తిథి భోజనం' ప్రారంభం

వేల్పూర్/సిరికొండ, జూలై 30: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా వేల్పూర్ మండలం పడిగెల్ ప్రభుత్వ పాఠశాలలో తిథి భోజనం కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. తల్లిదండ్రులు, విద్యాభిమానులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డబుల్ కా మీఠా, మిర్చి, అరటి పండ్లు వంటి వంటకాలతో భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ హుసినాబేగం, హెచ్ఎం చందర్ పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థుల తల్లులు ఈ వంటకాలు తయారు చేసి వడ్డించారు.

పడిగెల్‌లో విద్యార్థులకు మిర్చి బజ్జీలు వడ్డిస్తున్న మహిళలు

సిరికొండలోని ఆదర్శ పాఠశాలలో తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. ముంబైకి చెందిన ఓ వస్త్రవ్యాపారి విద్యార్థులందరికీ స్వీట్లు అందజేశారు.

రెంజల్ మండలంలోని కందకుర్తి ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలలో బదిలీపై వచ్చి ఉద్యోగోన్నతి పొందిన ఇద్దరు ఉపాధ్యాయులను మంగళవారం జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయులు సరోజిని, సపూరాబేగం, సిబ్బంది పాల్గొన్నారు. -రెంజల్,జూలై31

ఆర్థిక సాయం అందజేత

ఆర్థిక సాయం అందజేస్తున్న చేపూర్ యువకులు

ఆర్మూర్‌టౌన్, జూలై30: చేపూర్ గ్రామంలో బూర్ల మోహన్ తల్లి కాన్సర్‌తో ఇటీవల మృతి చెందింది. ఈ పేద కుటుంబం ఆర్థిక పరిస్థితిని ఆ గ్రామ యువకులు చేపూర్ వాట్సప్ గ్రూపులో షేర్ చేశారు. స్పందించిన గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అందరూ కలిసి రూ.25,500 ఆర్థిక సాయాన్ని మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

ఏక కాలంలో రుణమాఫీ చేయాలి

మోర్తాడ్, జూలై30: రైతులందరికీ ఏక కాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ మండలశాఖ డిమాండ్ చేసింది. ఆపార్టీ నాయకులు మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఆపార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేశ్ మాట్లాడుతూ.. ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ మాటతప్పిందని, ప్రస్తుతం ఇస్తున్న రుణమాఫీ కూడా కొందరికే వస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఆడియో ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్, జూలై30: సీజనల్ వ్యాధులపై రూపొందించిన ఆడియోను రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు రజనీశ్ కిరాడ్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో తిరిగే చెత్తబండ్లలో మున్సిపల్ ఆడియోతోపాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించే ఆడియోను అందజేశామని అన్నారు.

'విద్యార్థులను సిద్ధం చేయాలి'

బాల్కొండ, జూలై 30: స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం తెలుగు ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంతవో బట్టు రాజేశ్వర్ మాట్లాడారు. నవంబర్‌లో నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ ఘనపురం దేవేందర్, జిల్లా రిసోర్స్‌పర్సన్ నాగుల రాజేందర్‌గౌడ్, కాంప్లెక్స్ కార్యదర్శి శ్రీలక్ష్మి, బాల్కొండ, ఆర్మూర్, ముప్కాల్, మెండోరా, ఆలూర్ మండలాల తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాంప్రభు, సౌడ రవి, వివేకవర్ధన్, హారతి, అహల్య, బోచ్‌కర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాతంగల్‌లో ఒకరి దారుణ హత్య

పొతంగల్, జూలై 30: మండలంలోని బీసీ కాలనీకి చెందిన మేత్రి లాలయ్య(58) దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..లాలయ్య గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పని చేసేవాడు.పక్షవాతం రావడంతో కొంతకాలం నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఒక్కడే నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు కర్రలు, రాయితో మోది హత్య చేశారు. విషయం తెలుసుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ జయేష్‌రెడ్డి, ఎస్సై సందీప్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు కర్రలు రాళ్లతో కొట్టి చంపినట్లు గుర్తించారు. మృతుడి తమ్ముడు పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

సంక్షిప్తంగా..

- **మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్:** డిచ్‌పల్లి, జూలై 30: ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణ పథకంలోని మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా బీబీపూర్‌లో నల్ల దినేశ్‌రెడ్డి తోటని ఎనిమిది ఎకరాల్లో మంగవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. మొక్కల సాగు కోసం ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానవన శాఖాధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి కె.సంధ్యారాణి సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి భూమేశ్ పాల్గొన్నారు.
- **కోటగిరిలో సవారీ వేడుకలు:** కోటగిరి, జూలై 30: మండల కేంద్రంలో దుందుల్ సవారీ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పీర్లను ఎత్తుకొని ఊరేగింపు తీశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రచ్చగల్లీలో ప్రతి ఏటా దుందుల్ సవారీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జాతర కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఊరేగింపు అనంతరం పీర్లను గద్దెపై కూర్చోబెడుతామన్నారు.
- **ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలి :** ఖిల్లీవాడి (మోపాల్), జూలై 30: ప్రతి గ్రామంలో మొక్కటు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎపీడీవో రాములు, ఎంపీవో కిరణ్‌కుమార్ సూచించారు. మంగళవారం వారు మోపాల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.
- **రుద్రూర్‌లో షీటీం తనిఖీలు:** రుద్రూర్, జూలై 30: మండల కేంద్రంలో షీటీం బృందం సభ్యులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. 18 ఏండ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెకానిక్ షెడ్లు, కిరాణా షాపుల్లో తనిఖీలు చేపట్టి, చిన్న పిల్లలను పనిలో పెట్టుకోరాదని యజమానులకు సూచించారు. షీటీం బృందం షాకియాబేగం, మమత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, చైల్డ్ అధికారి ముజీబ్ పాల్గొన్నారు.
- **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ:** చందూర్, జూలై 30: చందూర్, మోస్రా మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాన్సువాడలోని తన నివాసంలో మంగళవారం అందజేశారు.
- **పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ:** మోస్రా (చందూర్), జూలై 30 : మోస్రా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 2003-2004 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు విరాళంగా15వేల రూపాయలు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బాలాజీ రావుకు మంగళవారం అందజేశారు. ల్యాబ్ కోసం విరాళం అందజేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.
- **టీటీసీ ఎగ్జామ్ సెంటర్స్ వద్ద 144 సెక్షన్:** వినాయక్‌నగర్, జూలై 30: జిల్లా కేంద్రంలో ఆగస్టు 4న నిర్వహించనున్న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లుగా సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ పక్కన ఉన్న హరిచరణ్ హిందీ విద్యాలయం, శివాజీనగర్‌లోని మానిక్‌భవన్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షా నిర్వహించే సెంటర్ల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు.
- **బ్యూటీపార్లర్‌తో స్వయం ఉపాధి:** డిచ్‌పల్లి, జూలై 30 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయ